
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
ఆదివారం 8 జూన్ 2025



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

● పలువురికి గాయాలు

6



పట్నాలు వేస్తున్న బైండ్ల వారు

ఎల్లమ్మ, పోచమ్మ బోనాలు చేస్తున్నామంటే పంబాల, బైండ్ల కళాకారులు ఉండాల్సిందే. జమిడిక, సుతి, పంబా వాయిద్యాలతో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ భక్తి పూర్వకంతో వారు అమ్మవార్లను కొలుస్తారు. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, సారుగమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి వంటి పూజా కార్యక్రమాల్లో ఈ పంబాల, బైండ్ల కళాకారులదే ప్రధాన భూమిక. ఎల్లమ్మ ఆలయాల్లో పట్నాలు వేయడం, పోతరాజుల వేషాలు, గ్రామ దేవతల ప్రాశస్త్యాన్ని కథల ద్వారా వివరించడం వంటి వంశ పారంపర్యంగా వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలను చెక్కుచెదరకుండా కొనసాగిస్తున్న కళాకారులు వారు.

జమిడిక మోత.. పంబాల, బైండ్ల ఆట



హుస్నాబాద్ ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో కథ చెబుతున్న పంబాల, బైండ్ల కళాకారులు

విభిన్న కళారూపం.. చెదరని సంస్కృతీ పయనం

గ్రామ దేవతల సంప్రదాయ పూజారులు

జమిడిక, సుతి, పంబజోడు వీరి వాయిద్యాలు

హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో ప్రత్యేకత చాటుతున్న కళాకారులు

7

ప్రభుత్వం జారీ చేసిన పని సర్దుబాటు జీవోతో ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. ఒక పక్క ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసేందుకు ఉపాధ్యాయులు సెలవు రోజుల్లో ముందస్తు బడిబాట నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం కెపాసిటీ బిల్డింగ్ పేరుతో కిందిస్థాయి ఉపాధ్యాయుల నుంచి పైఅధికారి వరకు వేసవి సెలవుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచుకోవడం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ (పని సర్దుబాటు) పేరుతో విడుదల చేసిన జీవో ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేస్తోంది.

\- కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి)



ఉపాధ్యాయుల్లో అయోమయం

పని సర్దుబాటు జీవోతో గందరగోళం

ప్రాథమిక పాఠశాలల నిర్వీర్యం

అశాస్త్రీయ విధానమంటూ టీచర్ల ఆగ్రహం

తీవ్ర సంఘర్షణలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులు

ఉత్తర్వుల ప్రకారం 10 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఆ తర్వాత 30 మందికి ఒకరు చొప్పున ఉండాలని జీవోలో పేర్కొన్నారు. ఈ నిష్పత్తి కంటే ఎక్కువ ఉన్న ఉపాధ్యాయులను అవసరం ఉన్న పాఠశాలలో విధులు నిర్వహించేలా చేయాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎంతమంది ఉన్నప్పటికీ సబ్జెక్టుకు ఒక టీచర్ చొప్పున ఏడు నుంచి పదిమంది వరకు ఉంటారు. కానీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కనుగుణంగా సర్దుబాటు చేయడం ఏమిటి అని ప్రైమరీ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు వాపోతున్నారు. 30 మంది విద్యార్థులకు కనీసం ముగ్గురు టీచర్లు ప్రాథమిక పాఠశాలలో ఉండాలని పలు సంఘాల నాయకులు ప్రభుత్వానికి ఎప్పటి నుంచో విజ్ఞప్తి చేస్తున్నారు. 30 మంది విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ పెరిగితే ప్రతీ తరగతికి ఒక టీచర్ చొప్పున కనీసం ఐదుగురు టీచర్లు ప్రాథమిక పాఠశాలలో ఉండాలని వారు కోరుతున్నారు. ప్రతీ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి అందుకు అనుగుణంగా అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

వేసవి సెలవుల్లో పడిన కష్టం వృథాయేనా?

విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడం కోసం అంకితభావంతో పనిచేస్తున్నారు. ఇందు కోసం వారు స్వచ్ఛందంగా ముందస్తు బడిబాట కార్యక్రమాలు చేపడుతూ ఇంటింటికీ వెళుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల పట్ల సానుకూల స్పందన వ్యక్తం అవుతోంది. ఈ తరుణంలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా ఉపాధ్యాయులను నియమించాల్సింది పోయి, గతంలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని నిర్ణయించడంతో తాము వేసవి సెలవులను కూడా వాడుకోకుండా పడిన కష్టం వృథా అవుతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉన్నత పాఠశాలలో ఒక సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండే విధంగా ఎలాంటి నిబంధనలు ఉన్నాయో, పాఠశాల విద్యకు పునాది అయినా ప్రాథమిక పాఠశాలలోనూ

మిగతా 8వ పేజీలో

ఉత్తర్వులను సవరించాలి



ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నట్లు ఓవైపు చెబుతూనే మరోవైపు వాటిని నిర్వీర్యం చేసేలా ఉత్తర్వులు జారీ చేయడం సరికాదు. ఇప్పటికే ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండేలా ఉన్న ఉత్తర్వులను కాదని, 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయి. ప్రభుత్వ పాఠశాలల పటిష్టత కోసం పూర్వ ప్రాథమిక తరగతి ప్రారంభించడంతో పాటు ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాల్సింది పోయి, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని పెంచడం సరికాదు.

\- మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, సిద్దిపేట

భక్తిశ్రద్ధలతో బక్రీద్



సిద్దిపేట ఈద్గాలో ప్రార్థనలను చేస్తున్న ముస్లింలు

సిద్దిపేట కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీదు పండుగను సిద్దిపేటలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. ఈద్ అల్ ఆదాను పురస్కరించుకుని శనివారం ఉదయం ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ఈద్గా మైదానంలోని ముస్లిం పెద్దలు ప్రవక్త బోధనలు వినిపించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అలయ్ బలాయ్ తీసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం తమ కబర్‌స్థాన్‌లో పూర్వీకుల సమాధులపై పూలతో ప్రత్యేకంగా చేసిన చదర్‌ను పరిచి ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు ఇబ్రహీం అలయ్ సలామ్ పేరుమీద ఖుర్బానీ ఇచ్చి దానగుణం చాటుకున్నారు.



సిద్దిపేట కబరస్థాన్‌లో చాదర్ సమర్పిస్తున్న ముస్లింలు



ఈద్గాలో స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నమాజు చేస్తున్న ముస్లింలు, ప్రవక్త బోధనలు వినిపిస్తున్న మతపెద్ద

రైతుల హక్కులను కాలరాసిన గత ప్రభుత్వం

● రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి



స్టాళ్లను పరిశీలిస్తున్న కోదండరెడ్డి

హుస్నాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రైతుల హక్కులను కాలరాసిందని రైతు కమిషన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ధరణి పేరుతో భూమిపై ఉన్న హక్కును రైతులకు కాకుండా చేసిందని మండిపడ్డారు. రైతు విత్తన హక్కును ప్రైవేట్ కంపెనీలకు ధారదత్తం చేసిందని ఆరోపించారు. హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండో రోజైన శనివారం కొనసాగుతున్న రైతు మహోత్సవ సమావేశంలో మాట్లాడారు. రైతు బిడ్డ రేవంత్‌రెడ్డి సీఎం అయిన తరువాత రైతుల్లో ధైర్యం వచ్చిందన్నారు. రైతుకు విత్తన హక్కును కల్పించే దిశగా విత్తన చట్టం తీసుకరావడానికి కమిటీ వేశారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే సీఎం లక్ష్యంగా పెట్టుకొని పెనుమార్పులు తీసుకవస్తున్నారన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నదని ఆరోపించారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరామన్నారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం వల్ల చాలా మంది రైతులు సంతోషపడ్డారన్నారు. త్వరలో ఆదర్శ రైతు వ్యవస్థను తీసుకొస్తున్నామన్నారు. చెరువుల బాధ్యత కూడా రైతులకు ఇవ్వబోతున్నదని తెలిపారు. అనంతరం సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా రైతులకు మేలైన విత్తనాలు అందిస్తున్నామన్నారు. ప్రతీ రైతు పంట మార్పిడి చేసి దిగుబడి సాధించాలని కోరారు. అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, రైతు కమిషన్ సభ్యులు భవానీరెడ్డి, కేవీఎన్‌రెడ్డి రైతులను ఉద్దేశించి ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

సందడిగా రైతు మహోత్సవం

7

బడికి వేళాయే

12న తెరుచుకోనున్న పాఠశాలలు

స్కూళ్లకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు

ప్రారంభమైన బడిబాట కార్యక్రమం

అడ్మిషన్లు పెరిగేలా ప్రత్యేక చర్యలు

సిద్దిపేట కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరానికి బడి గంటలు మోగనున్నాయి. ఈ నెల 12 నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. 45 రోజుల పాటు విరామం తర్వాత స్కూళ్ల ప్రారంభం కానున్నాయి. గతేడాదితో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచడానికి విద్యాధికారులు సిద్ధమవుతున్నారు. స్కూళ్ల ప్రారంభం కాగానే ప్రత్యేక కార్యక్రమాలకు అధికారులు కార్యచరణ రూపొందించారు.



సిద్దిపేటలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

బడిబాట షురూ

ఈ నెల 6 నుంచి ప్రారంభమైన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఈ నెల 19 వరకు కొనసాగనుంది. ఈ బడిబాటలో జిల్లా విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్‌లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వివరిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు గురించి చెబుతూ ఊరూవాడ తిరుగుతున్నారు. గ్రామసభల నిర్వహిస్తూ అడ్మిషన్లు పెరిగేలా చేస్తున్నారు. గతేడాది 8 వేలకుపైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ సంవత్సరం ఆ సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ ప్రణాళికబద్ధంగా ముందుకెళ్తోంది.

ప్రత్యేక కార్యక్రమాలు

ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం కాగానే ప్రత్యేక కార్యక్రమాలతో తల్లిదండ్రుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేసేందుకు ప్రణాళికలు చేశారు. మొదటిరోజు నుంచే పాఠశాలలను అందంగా ముస్తాబు చేసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్‌లు, యూనిఫామ్‌లు అందజేయనున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, క్రీడల్లో మంచి ప్రదర్శన చూపిన క్రీడాకారులను అభినందించి ప్రశంసాపత్రాలను ఇవ్వనున్నారు. పాఠశాలకు కొత్తగా వచ్చే విద్యార్థులకు ఈ నెల 13న సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించాలని సంకల్పించారు. జిల్లాలో సుమారు 96 వేల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తరగతుల వారీగా దాదాపు 5.40 లక్షల పుస్తకాలు అందించనున్నారు. ఇప్పటి వరకు 95 శాతం పైగా పుస్తకాలు జిల్లాకు వచ్చాయి.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

వామపక్ష నేతల డిమాండ్

సిద్దిపేట పట్టణంలో భారీ ర్యాలీ

8

బాలుడి ఆలోచన అదుర్స్

పాత సామగ్రితో సైకిల్ మోపెడ్ తయారీ

తక్కువ ఖర్చుతో శ్రమ లేకుండానే ప్రయాణం

7

మద్యం మత్తులో తండ్రిని చంపిన తనయుడు

7

కూతురి ప్రేమ పెళ్లితో గొడవ



పరేషన్

సిద్దిపేట పట్టణంలో మూడు నెలల రేషన్ బియ్యం కోసం కార్డుదారులకు పడిగాపులు తప్పడం లేదు. శనివారం ఉదయం శ్రీనగర్ కాలనీలోని ఓ రేషన్‌షాపులో డీలర్ బియ్యం పంపిణీ చేయగా సర్వర్ డౌన్ కావడంతో తిరిగి సాయంత్రం రమ్మని చెప్పారు. కానీ లబ్ధిదారులు మాత్రం మధ్యాహ్నం రెండు గంటల నుంచే రేషన్ షాపు ఎదుట కవర్లు, చెప్పులను వరుస క్రమంలో ఉంచి ఐదు గంటల దరకు వేచిఉన్నారు. షాపు తెరిచిన డీలర్ సర్వర్ డౌన్ ఉన్నందున 35 మందికి మాత్రమే రేషన్ ఇస్తానని చెప్పడంతో మిగతా వారు నిరాశతో వెనుదిరిగారు.

\- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జూన్ 7







వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

కారు ఢీకొని బాలిక..


అర్చన(ఫైల్)

నర్సాపూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని బాలిక మృతిచెందిన సంఘటన నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రోడ్డుపై హన్మంతాపూర్ సమీపంలో చోటు చేసుకున్నది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం అర్జున్, లలితల కూతురు అర్చన(8) కుటుంబ సభ్యులతో కలిసి హన్మంతాపూర్ నుంచి నర్సాపూర్‌కు సాయంత్రం నడచుకుంటూ వస్తున్నది. ఈ క్రమంలో శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్లకు చెందిన కారు వేగంగా వచ్చి బాలికను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. ఆమెను వెంటనే నర్సాపూర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ..

నర్సాపూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 3న నర్సాపూర్‌కు చెందిన విభూషన్‌రెడ్డి(44) సంగారెడ్డికి వెళ్లి తిరిగి నర్సాపూర్ వస్తున్న క్రమంలో నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డుపై ఎల్లమ్మ గుడి వద్ద వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతడిని గాంధీకి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ కొని..


శివగౌడ్(ఫైల్)

పెద్దశంకరంపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కారు , బైక్ ఎదురెదురుగా ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఉత్తులూరు శివారులో చోటుచేసుకుంది. పేట ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండలం వెల్పుగొండ గ్రామానికి చెందిన కోటగిరి శివగౌడ్(49) పెద్దశంకరంపేట నుంచి సొంత గ్రామమైన వెల్పుగొండకు బైక్ పై వెళ్తున్నాడు. అదే సమయంలో ఉత్తులూరు నుంచి ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు సాకేత్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేట ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొని రైతు..


బాలయ్య

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో రైతు మృతి చెందాడు. ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ర్యాకల్‌కు చెందిన బాలయ్య(50) ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకుని అదే గ్రామానికి చెందిన డ్రైవర్ బాగయ్య తన పొలం దున్నడానికి దున్నిస్తున్నాడు. ఈ క్రమంలో బాలయ్యను ట్రాక్టర్ ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బాలయ్యకు భార్య, కూతురు , కుమారుడు ఉన్నారు. .

కారు ఢీకొని లారీ డ్రైవర్..

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్ కారు ఢీకొని మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ముడికే మల్లేశం (54) కొన్ని సంవత్సరాలుగా సిద్దిపేటలో నివాసముంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిద్దిపేటకు చెందిన లారీపై హైదరాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో తిమ్మారెడ్డిపల్లి వద్ద నిలిపి రోడ్డుకు అవతలి వైపు ఉన్న హోటల్‌కు టీ తాగేందుకు నడుచుకుంటూ వెళ్లాడు. తిరిగి లారీ వద్దకు వస్తున్న క్రమంలో సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతడిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ పరిశీలించారు.

వాహనం ఢీకొని

అల్లాదుర్గం,జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన మహేష్, మరో ఇద్దరు యువకులతో కలసి జోగిపేట వైపు నుంచి నాందెడ్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని చిల్వర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఒక్క సారిగా గుర్తుతెలియని వాహనం వెనక్కి తీసుకుంటున్న సమయంలో వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయలయ్యాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


రామ్మోహన్‌రెడ్డి (ఫైల్

రాయపోల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ రఘుపతి కథనం ప్రకారం.. గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కర్ర్యల రామ్మోహన్‌రెడ్డి(44) శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో బైకు తీసుకొని పనిపై బయటికెళ్లాడు. రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి వద్ద ఆయన బైకును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రామ్మోహన్‌రెడ్డి భార్య కర్ర్యల మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు..


బాపురెడ్డి(ఫైల్

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతిచెందిన సంఘటన కొండపాక మండల పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలంలోని సిరిసినగండ్ల గ్రామానికి చెందిన దేవిరెడ్డి బాపురెడ్డి(45) తన పొలంలో భూమి చదును చేయడానికి ట్రాక్టర్‌ను తానే నడుపుతూ వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి నీళ్ల లేని కాలువలో బోల్తా పడడగా, చక్రాల కింద పడి బాపురెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిబ్రవరి నెలలో బాపురెడ్డి కుమారుడు ఉదయ్‌కిరణ్ రెడ్డి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందగా, తాజాగా ఆయన ప్రమాదవశాత్తు మృతిచెందడంతో కుంటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్ చెట్టును ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

రాయపోల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొనగా ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన రాయపోల్ ఉన్నత పాఠశాల వద్ద శనివారం చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ బాలాజీనగర్‌కు చెందిన కోదాటి కిషోర్(28) వాడితే, వాసూనాయక్(35) వేములవాడ దేవస్థానానికి వెళ్లి శనివారం తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మూలమలుపు వద్ద వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న కిషోర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది భాను, నర్సింహులు తెలిపారు.

రెండు కార్లు ఢీకొని పలువురికి..

అల్లాదుర్గం, జూన్.7 (ఆంధ్రజ్యోతి) :అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారి పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్ వైపు వెళ్తున్న రెండు కార్లు మండలంలోని చిల్వర్ గ్రామ సమీపంలో వెనకవైను చుంచివస్తున్న కారు ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయానిస్తున్న వారికి గాయాలు కావడంతో వారిని ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

కుంటలో పడి యువకుడి మృతి


శేఖర్(ఫైల్)

చిలప్‌చెడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుంటలో పడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండపోతుగల్ గ్రామానికి చెందిన శేఖర్(24) ఫైజాబాద్ గ్రామానికి చెందిన టేకుల నర్సింహారెడ్డి వద్ద బర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బర్రెలు మేపడానికని వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయాన్ని యజమాని టేకుల నరసింహారెడ్డి శేఖర్ తల్లిదండ్రులకు తెలియజేయగా శనివారం ఉదయం వడ్లవానికుంట వైపు వెతకగా శేఖర్ మృతదేహం నీటిలో తేలి కనిపించింది. పశువులను కడగడానికి కుంటలోకి దిగి ఉంటాడని, ఈత రాకపోవడంతో మృతిచెంది ఉంటాడని మృతుడి తండ్రి దార హనుమంతు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోహీర్, జూన్ 7:(ఆంధ్రజ్యోతి) గూడ్స్ రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కోహీర్ మండలంలోని రాజనేల్లి గ్రామ శివారులోని రైల్వే ట్రక్‌పై శనివారం ఉదయం చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం గూడ్స్ రైలు కింద పడి మృతి చెందిన వ్యక్తి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఒంటిపైన తెలుపు రంగు ఫుల్‌షర్ట్, కాఫీ కలర్ ఫ్యాంట్ నలుపు రంగు మొలతాడు ధరించి ఉన్నాడని తెలిపారు. అతడి మృతదేహాన్ని వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతునికి సంభందించి సమాచారం, ఆచూకీ తెలిసిన వారు వికారాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, లేదా 7702629707 నంబర్‌ను సంప్రదించవచ్చని రైల్వే పోలీసులు తెలిపారు.

భూతగాదాలతో వ్యక్తి ఆత్మహత్య

చేగుంట ,జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో జరుగుతున్న తగాదాకు మనస్తాపం చెంది ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది .చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం: పులిమామిడి గ్రామానికి చెందిన కొమ్ము స్వామి(34) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు గ్రామంలో సర్వేనెంబర్ 309 /ర 108 నందు అతడికి ఎకరా 20 గుంటల భూమి ఉన్నది. ఆ భూమి విషయంలో పులిమామిడి గ్రామానికి చెందిన ఎమ్మాజి బాలమణితో గత కొంతకాలంగా భూతగాద జరుగుతున్నది. ఈ విషయంలో కొమ్ము స్వామి మనస్తాపం చెంది తన వ్యవసాయం పొలంలో వైరుతో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య రేణుక ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవాన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సండే స్పెషల్ Sunday Special

జమిడిక మోత.. పంబాల, బైండ్ల ఆట

- విభిన్న కళారూపం.. చెదరని సంస్కృతీ పయనం
- గ్రామ దేవతల సంప్రదాయ పూజారులు
- జమిడిక, సుతి, పంబజోడు వీరి వాయిద్యాలు
- హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో ప్రత్యేకత చాటుతున్న కళాకారులు

హుస్నాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల కాలంగా వస్తున్న తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతున్నారు పంబాల, బైండ్ల పూజారులు. గ్రామ దేవతల వద్ద తమ కళారూపంతో పూజలు చేస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. భక్తి భావంతో గ్రామ దేవతలను కొలుస్తూనే వారి ఆటాపాటలుంటాయి. అమ్మవార్లను కొలుస్తూ వీరు ప్రదర్శించే ఆటాపాటలకు శివసత్తులు శిగలూగుతారు. భక్తులు చిందేస్తారు. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ కులాలను ఐక్యం చేసిన బోనాల సంస్కృతీలోనూ పంబాల, బైండ్ల కళాకారులదే ప్రధాన భూమిక ఉంటుంది. వీరి వాయిద్యాలు కూడా విభిన్నంగా ఉంటాయి. జమిడిక, సుతి, పంబా వాయిద్యాలను వాయిస్తూ, లయబద్ధంగా కథ చెబుతూ, అందుకు తగ్గట్టుగా అభినయిస్తూ అమ్మవార్లను కొలుస్తారు.


జమిడిక, సుతితో కళాకారులు(ఫైల్)

పంబాల, బైండ్ల కళాకారుల చరిత్ర

పురాణాల ప్రకారం ఎల్లమ్మ దేవికి ముగ్గురు కుమారులుంటారు. ఎల్లమ్మ భర్తయిన జమదగ్ని తన కుమారుడైన పరశురాముడిని తల్లి ఎల్లమ్మ శిరస్సును ఖండించమని ఆజ్ఞాపిస్తాడు. నా కుమారుడు ఎలాగైన చంపుతాడని పరుగెత్తి హరిజన వాడలోని లందగోళంలో దాగి ఉంటుంది. పరశురాముడు ఆమె బయటకు రావాలని కంచు జమిడిక తయారు చేసి మోగిస్తాడు. ఎల్లమ్మ దేవికి జమిడిక సప్పుడంటే చాలా ఇష్టం. ఆ వాయిద్య సప్పుడు వినగానే ఎల్లమ్మ తల్లి బయటకు రావడంతో పరశురాముడు తల్లి తలను ఖండిస్తాడు. అప్పుడే రానున్న కలియుగంలో పంబాల, బైండ్ల వారు పుట్టనున్నారని, జమిడిక ఆధారంగా చేసుకొని ఎల్లమ్మ కొలుపు చేసుకుంటూ జీవిస్తారని చెప్పినట్లు చరిత్ర ఉందని పంబాల, బైండ్ల కళాకారులు తెలిపారు. అప్పటి నుంచి ఇదే అచారం కొనసాగుతుందని తెలిపారు. వైశాఖ, శ్రావణం, ఆషాడమాసాల్లో ప్రతీ గ్రామంలో పోచమ్మ, ఎల్లమ్మ బోనాలు చేసుకుంటారు. ఈ పూజలను నిర్వహిస్తూ భక్తులు ఇచ్చే డబ్బుతో జీవనం సాగిస్తూ వారు ఆచారాన్ని కొనసాగిస్తున్నారు.

హుస్నాబాద్‌లో 50పైగా కుటుంబాలు

హుస్నాబాద్ ప్రాంతంలో పంబాల, బైండ్ల కళాకారులు దాదాపు 50 కుటుంబాలకుపైగా ఉంటాయి. వీరు గ్రామాలను పంచుకుని ఆ గ్రామాల్లో జరిగే గ్రామ దేవతల కార్యక్రమాల్లో పూజలు చేస్తారు. గత 27 రోజులుగా జరుగుతున్న హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో భక్తులకు అమ్మవారి ప్రాశస్త్యాన్ని వివరిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఆచారాన్ని కొనసాగిస్తున్నాం

తాతల కాలం నాటి నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, మహలక్ష్మి, భూలక్ష్మి, బొడ్రాయి వంటి గ్రామ దేవతలను కొలవడం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు మమ్మల్ని ఆదరిస్తుండటంతో ఈ సంస్కృతిని రక్షించుకుంటున్నాం.

- వేముగంటి శ్రీనివాస్, బైండ్ల కళాకారుడు


ఎల్లమ్మ పట్నాలు వేస్తున్న బైండ్ల కళాకారుడు


బసవ ప్రార్ధన పుస్తక రూపంలో ముద్రించిన పెళ్లి పత్రిక

బసవ ప్రార్థన పుస్తకంలో పెళ్లి పత్రిక

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వివాహ ఆహ్వాన పత్రికలను పోటీలు పడి అచ్చు వేయిస్తున్న ప్రస్తుత తరుణంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన నీలకంఠం శంకరప్ప, సుగుణ దంపతులు తమ కుమారుడు సూర్యకిరణ్ వివాహ పత్రికను వినూత్నంగా ముద్రింపజేశారు. పలువురిలో సంస్కారం, బసవతత్వాన్ని పెంపొందింప చేసే విధంగా బసవ ప్రార్థనపుస్తకంలోనే వివాహ పత్రికను అచ్చు వేయించి ప్రశంసలు పొందుతున్నారు. బసవేశ్వరుడు చూపిన మార్గదర్శకాలను తెలుపుతూ పెళ్లి పత్రికను రూపొందించారు. లింగాయత్ ధర్మ షట్ సూత్రాలను ముద్రింప చేశారు. వారి వివాహం నేడు నారాయణఖేడ్‌లోని బసవ మండపంలో నిర్వహించనున్నారు.

ఒకే ఏడాదిలో తండ్రీకొడుకులు పది పాస్

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చదువుకు వయసుతో సంబంధం లేదు. చదవాలని తపన ఉంటే దానిని సాధించవచ్చు. అందుకు ఉదాహరణ కొండపాక మండలం గిరాయిపల్లి గ్రామానికి చెందిన ముక్కెర 38 ఏళ్ల బాలనర్సు. ఆయన ఓపెన్ వర్సిటీలో పది పరీక్ష రాసి 248 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఆయన కుమారుడు ప్రదీప్ ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో 444 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఇలా తండ్రీకొడుకు ఒకే సంవత్సరంలో పదోతరగతి పాసవ్వడంతో పలువురు అభినందించారు.

ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

జిన్నారం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిన్నారం ఎస్టీ గురుకుల కళాశాలలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లకు ఈ నెల 13న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులలో మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, కేవలం ఎస్టీ విద్యార్థులు మాత్రమే అర్హులని, ఆసక్తి గల వారు సంబంధిత సర్టిఫికేట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

శిక్షణ ముగిసే... ఆచరణే తరువాయి

- 12 నుంచి బడులు పున:ప్రారంభం
- అభ్యసన సామర్థ్యాల పెంపునకు టీచర్ల సన్నద్ధం

సంగారెడ్డి అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించి ఆసక్తికరంగా బోధన అందించేందుకు గత నెల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మే 13 నుంచి 31 వ తేదీ వరకు మూడు విడతల్లో నిర్వహించిన శిక్షణలో 3630 మంది ఉపాధ్యాయులు శిక్షణలో తర్ఫీదు పొందారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ ఉపాధ్యాయులను సన్నద్ధం చేసింది. అయితే మరో ఐదు రోజుల్లో వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో శిక్షణలో నేర్చుకున్న అంశాలను, బోధన పద్ధతులను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అమలు చేయాల్సి ఉంటుంది.

ఆచరణే మిగిలింది

బోధనలో నాణ్యతను పెంచడంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపునకు శిక్షణ దోహద పడిందని ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఉపాధ్యాయుల సన్నద్ధత, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారుచేసుకోవడం, ఇంటరాక్టివ్ ప్యానెల్స్ ద్వారా ఎలా బోధించాలి వంటి వాటిపై అవగాహన కల్పించారు. తరగతి గదిలో విద్యార్థులను ఆకర్షించేలా వారు ఇష్టంగా వినేలా ఆయా సబ్జెక్టుల్లో బోధన చేయాల్సి ఉంటుంది. పాఠ్యాంశాల అంశమే కాకుండా యువత ఎదుర్కొంటున్న సమస్యలు మహిళల అక్రమ రవాణా, పోక్సో చట్టంపై అవగాహన, సైబర్ సెక్యూరిటీ తదితర వాటిపై శిక్షణ పొందారు. ఏదేమైనప్పటికీ ఉపాధ్యాయులకు ఇచ్చిన వృత్తంతర శిక్షణలో తర్ఫీదు పొందిన అంశాలను సర్కారు బడి పిల్లలకు క్షేత్ర స్థాయిలో ఆచరణ అమలు ఏ మేరకు సత్ఫలితాలిస్తుందో వేచి చూడాల్సిందే.


సంగారెడ్డిలో టీచర్లకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఫైల్)

బాలుడి ఆలోచన అదుర్స్

- పాత సామగ్రితో సైకిల్‌ను మోపెడ్‌గా తయారీ
- తక్కువ ఖర్చుతో శ్రమ లేకుండానే ప్రయాణం

నారాయణఖేడ్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మోపెడ్‌పై ప్రయాణం చేయాలనే కోరికే ఆ బాలుడితో తన సైకిల్‌నే మోపెడ్‌గా తయారు చేసుకునేలా చేసింది. 9వ తరగతి చదువుతున్న బాలుడు తన తాత ఇప్పించిన సైకిల్‌నే పాత స్ప్రేయర్ పంపు మోటర్‌తో మోపెడ్‌ను చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం జి.హుక్రానకు చెందిన వడ్ల నర్సింహులు, మంజుల దంపతులు కొన్నేళ్లుగా నారాయణఖేడ్‌లో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు శివకుమార్ చారి, శ్రీకాంత్ సంతానం. నర్సింహులు నారాయణఖేడ్‌లో వెల్డింగ్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పెద్ద కుమారుడు శివకుమార్ చారి స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అందరిలాగే తాను కూడా మోపేడ్ నడపాలనే ఆశ ఉన్నప్పటికీ, దాని కొనుగోలుకు రూ.60 వేల వరకు అవసరం కావడంతో తానే స్వయంగా సైకిల్‌నే మోపెడ్‌గా మార్చి శభాష్ అనిపించుకుంటున్నాడు. క్రిమి సంహారక మందులను పిచికారీ చేసే స్ప్రేయర్ మోటర్‌ను బాబాయ్ రమేష్ సహాయంతో తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. దాన్ని సైకిల్ క్యారిల్‌పై అమర్చి, టీవీఎస్ ఎక్సల్‌కు సంబంధించిన చైన్, చక్రం, కొనుగోలు చేసి మధ్యలో బిగించడమే కాకుండా ఎక్సలేటర్ వైర్‌ను సైకిల్ హ్యాండిల్‌కు బిగించాడు. మోటర్ తీగ సహాయంతో ఆన్ చేసిన అనంతరం సీటుపై కూర్చోని ఎక్సలేటర్ ఇవ్వగానే, సైకిల్ పైడిల్ తొక్కకుండానే ముందుకు సాగుతుంది. నాలుగు రోజుల క్రితమే శివకుమార్ దీన్ని తయారు చేశాడు. స్ప్రేయర్ పంపు పాతది కావడంతో లీటర్ పెట్రోల్‌కు 40 కిలో మీటర్ల మైలేజ్ ఇస్తుందని బాలుడు తెలిపాడు. కేవలం రూ.5 వేలతోనే దీన్ని తయారు చేసినట్లు చెప్పాడు.


తాను తయారు చేసుకున్న మోపేడ్ సైకిల్‌పై శివకుమార్‌చారి

క్రైం కార్నర్

నీట మునిగి యువకుడి మృతి


బాల్ రాజు (ఫైల్ ఫోటో)

పాపన్నపేట, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ నీట మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పొడ్చన్‌పల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నమోల బాల్ రాజు(29) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చేపలు పట్టేందుకు శనివారం గ్రామంలో ఉన్న గడం చెరువు వద్దకు వెళ్లి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ నీట మునిగాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తండ్రి మోగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకార్మికుడు..

నర్సాపూర్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి మత్స్య కార్మికుడు మృతిచెందాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి చెందిన మత్స్యకార్మికుడు యాదగిరి(45) శనివారం సాయంత్రం స్థానిక రాయరావు చెరువులో చేపల కోసం వెళ్లాడు. చెరువులో చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు వల తట్టుకుని బయటకు రాలేక నీట మునిగి మతిచెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో తండ్రిని కొట్టి చంపిన తనయుడు


మొగులయ్య (ఫైల్)

కోహీర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొడుకు తన తండ్రిని విచక్షణరహితంగా కొట్టి చంపిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బుచన్ పల్లి మొగులయ్య (46)కు భార్య, ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉంది. మొగులయ్య కష్టపడి ముగ్గురు పిల్లలను చదివించాడు. తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూతురు వివాహాన్ని వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలానికి చెందిన వ్యక్తితో జరిపించేందుకు మొగులయ్య, భార్య అమృతం నిశ్చయించారు. గత ఏప్రిల్ 16న తేదీన పెళ్లి చేసేందుకు పత్రికలు కూడా పంచేశారు. అయితే, మొగులయ్య కూతురు నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమించి, పెళ్లికి ముందురోజు ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కూతురును ప్రేమించిన యువకుడు తన పెద్ద కుమారుడైన మహేష్ స్నేహితులు కావడంతో తనకు ముందే ఈ విషయం చెప్పకుండా పరువు తీశారని కొడుకుతో గొడవపడుతుండేవాడు. శుక్రవారం రాత్రి కూడా తండ్రీ కొడుకుల మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న మహేష్ మొగులయ్యను ఇనుపరాడ్‌తో విచక్షరహితంగా కొట్టాడు. దీంతో, తీవ్రంగా గాయపడిన మొగులయ్యను కుటుంబ సభ్యులు కోహీర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం జహీరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడికి చేరుకునేసరికే మొగులయ్య మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్ తెలిపారు.

అనారోగ్యంతో పీపుల్స్ వార్ మాజీ దళనాయకుడి మృతి


పోచయ్య (ఫైల్)

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పీపుల్స్ వార్ గిరాయిపల్లి మాజీ దళనాయకుడు కోటగళ్ల పోచయ్య ఎలియాస్ రాజన్న అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పోచయ్య ఆనాటి పీపుల్స్ వార్ గ్రూప్‌లో గిరాయిపల్లి దళంలో సభ్యుడిగా చేరాడు. తర్వాత దళ నాయకుడిగా బాధ్యతలు చేపట్టి మూడు సంవత్సరాలపాటు కొనసాగాడు. హైదరాబాద్‌లో కొరియర్ మన్‌గా పనిచేశాడు. కొంతకాలంలో తర్వాత పోలీసులకు లొంగిపోయి గ్రామంలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

అంధకారంలో రేగోడు రైతు వేదిక

రేగోడు జూన్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు, అధికారులు సభలు, సమవేశాలు, నూతన పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలు నిర్వహణ సరిగా లేకపోవడంతో అసౌకర్యంగా మారాయి. రేగోడు రైతు వేదిక రెండేళ్లుగా విద్యుత్, తాగునీటి సౌకర్యానికి నోచుకోవడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంతో ఉందో తెలుసుకోవచ్చు. విద్యుత్ బిగించిన ఎర్తింగ్ సమస్యతో విద్యుత్ సరఫరా జరగడంలేదు. ఇటీవల భూభారతి చట్టంపై కలెక్టర్ రాహుల్ రాజ్ సదస్సు ఏర్పాటు చేయగా ఒక రోజు కోసం విద్యుత్ సరఫరా చేసి వదిలేశారు. దీంతో ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు, వీడియో పరికాలు అలంకార ప్రాయంగా మారాయి. నీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు సౌకర్యం లేకుండా పోయింది. మరుగుదొడ్లు నిర్మించిన నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


వ్యవసాయ యంత్రాల స్టాల్‌లో రైతుల సందడి




వ్యవసాయ పనిముట్ల స్టాల్ వద్ద సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సెల్ఫీ దిగుతున్న రైతు

సందడిగా..

హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న కిసాన్ మేళా శనివారం కూడా రైతులతో సందడిగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు యార్డులో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు పలు పంటలపై ప్రత్యేక అవగామన కార్యక్రమాలు నిర్వహించారు. ఫిష్ పాండ్‌లను చిన్నారులు ఎంతో ఆసక్తి తిలకించారు. అధునాతన వ్యవసాయ యంత్రాలపై రైతులు ఆరా తీశారు. అనంతరం సెల్ఫీలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు.


గడ్డి కటింగ్ చేసే యంత్రం వద్ద రైతులు


ఫిష్ పాండ్ వద్ద చిన్నారులు

న్యూస్ బాక్స్

పెద్దమ్మ గుడికి భూమి పూజ

ములుగు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ములుగు మండల కేంద్రంలోని మాసాన్‌పల్లి గ్రామంలో శనివారం ముదిరాజ్ కులం పెద్దమనిషి ఉప్పరి మల్లయ్య యాదగిరి ఆధ్వర్యంలో పెద్దమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో శివరాములు, లక్ష్మణ్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఆరె పెంటయ్య, ఉప్పరి నర్సింలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృత్యువాత

చేర్యాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘతంతో పాడిఆవు మృత్యువాత పడింది. ఈఘటన నాగపురి గ్రామంలో జరిగింది. బాధిత రైతు కాట తిరుపతి తెలిపిన వివరాల మేరకు . తన వ్యవసాయ బావి వద్ద గల కంచెలో పాడిఆవును మేత మేసేందుకు వదిలినట్లు తెలిపారు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడిమేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిందని తెలిపారు. పాడిఆవు సుమారు రూ.90వేలు ఉంటుందన్నారు. పాడిఆవుతో తాను జీవనోపాధి కోల్పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.



చేర్యాల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



నారాయణరావుపేట మండల కేంద్రంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఘనంగా బక్రీద్ వేడుకలు

జిల్లాలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఆయా గ్రామాల్లోని ఈద్గా, మజీద్‌ల వద్ద సామూహిక నమాజ్ చేశారు. ఒకరికొకరు అలయ్‌బలయ్ తీసుకోని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ముస్లింలకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి)



గజ్వేల్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



కొమురవెల్లి మండలం అయినపూర్ గ్రామంలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

వికసిత కృషి సంకల్ప అభియాన్

కుకునూరుపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులకు ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు వాతావరణ మార్పులు, వ్యవసాయ పంటల పరిరక్షణ, అధిక దిగుబడులు, డ్రోన్ వినియోగం, ఇతర పద్ధతులపై అవగాహన కల్పించారు. నేల సంరక్షణ పొలంలో మట్టి నమూనాల సేకరణ, మట్టి నమూనాల పరీక్షలు వంటి అంశాలు వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఉదయ్ కుమార్, ఏఈఓ డబ్బేటా కిరణ్ మరియు రైతులు పాల్గొన్నారు

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

ములుగు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జులై 7న 31వ సంవత్సరం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బాధ్యతలతో పాటు గజ్వేల్ బాధ్యతలు నాకు అప్పగించడం జిల్లా ఎమ్మార్పీఎస్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించడం కోసం ప్రతి గ్రామంలో అందరితో కలిసి పనిచేస్తానన్నారు.

కిసాన్‌మేళాకు 3 వేల విస్తర్లు



ఆటోలో హుస్నాబాద్ కిసాన్‌మేళాకు విస్తారాకులను తరలిస్తున్న ఎంపీవో

మద్దూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట, మద్దూరు మండల కేంద్రాల నుంచి హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న కిసాన్‌మేళాకు మోదుగు ఆకులతో తయారు చేయించిన 3 వేల విస్తర్లను పంపించినట్లు ఎంపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయమై ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ఉపాధిహామీ కూలీలతో తయారు చేయించిన విస్తర్లను ఆటోలో పంపించినట్లు తెలిపారు. స్థానికంగా గ్రామస్థులకు ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను వివరిస్తున్నట్లు ఎంపీవో తెలిపారు. ఈ సందర్భంగా ధూళిమిట్ట ఇన్‌చార్జి ఎంపీడీవో వీరరాజు, మద్దూరు ఎంపీడీవో రాంమోహన్ ఎంపీవోను అభినందించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



మక్తమాసాన్‌పల్లిలో బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శిస్తున్న ఏసీపీ నర్సింహులు

గజ్వేల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పోలీసులు అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని గజ్వేల్ ఏసీపీ కోనం నర్సింహులు సూచించారు. గజ్వేల్ మండల పరిధిలోని మక్తమాసాన్‌పల్లి గ్రామంలోని బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించి, వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. వర్టికల్ వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షనిస్ట్ ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే దరఖాస్తు దారుడితో మాట్లాడి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత వాహన యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని సూచించారు. వీపీవో వ్యవస్థను మెరుగుపరచాలని, వారంలో రెండు, మూడు సార్లు గ్రామాలను సందర్శించాలని సిబ్బందికి ఆయన సూచించారు. ప్రతి కేసులో పారదర్శక విచారణ జరపాలని, కేడీలు, డీసీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై మరింత నిఘా ఉంచాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు.

సీసీ రోడ్డు సరే.. మురికి కాలువ ఏదీ?



రోడ్డుపై పారుతున్న మురుగు

నంగునూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాల కోసం రోడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ ఇరువైపులా మురికి కాలువ నిర్మించకపోవడం వల్ల చిరుజల్లులకే రోడ్డు అంతా బురదమయం అవుతుంది. నంగునూరు మండలం మగ్దూంపూర్ గ్రామంలో పాఠశాల పక్క నుంచి వెళ్లే గల్లీలో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ సీసీ రోడ్డు మీద చేరుకున్న నీరు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ముందు చూపు లేకుండా కాంట్రాక్టర్లు తమ స్వలాభం కోసం సీసీ రోడ్డు నిర్మించారు, కానీ సీసీ రోడ్డు మీద చేరిన నీరు బయటకు పంపలనే ఆలోచన లేకపోవడం గమనార్హం.. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే ముడుపులు తీసుకుని ఇష్టానుసారంగా రోడ్ల నిర్మాణం చేపట్టారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్డుపై బురదగా మారి నడవలేని స్థితిలో ఉంటుంది. కనుక ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సీసీ రోడ్డు కు ఇరువైపులా చిన్నపాటి మురికి కాలువ నిర్మించి ఆ నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేద రెడ్డి విద్యార్థులకు చేయూత



విద్యార్థులను సన్మానించి నగదు పురస్కారం అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే నిరుపేద రెడ్డి విద్యార్థులకు రెడ్డి సంక్షేమ సంఘం అండగా నిలుస్తుందని రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు అన్నారు. పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులను రెడ్డి సంక్షేమ సంఘంలో శనివారం ఘనంగా సన్మానించి మొమెంటో, ఒక్కొక్కరికి రూ.5000ల నగదును అందచేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ నిరుపేద రెడ్డి విద్యార్థులకు విద్యాపరంగా అన్ని విధాల సహకారాన్ని అందించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మాణిక్య రెడ్డి, అధ్యక్షుడు వంగ తిరుమల రెడ్డి, ప్రధాన కార్యదర్శి సద్ది నాగరాజు రెడ్డి, ప్రతినిధులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బడిబాట



పాఠశాల వివరాలతో కూడిన ఫ్లెక్సీ

కొండపాక, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పిల్లలను బడిలో చేర్పించడం కోసం మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ తయారుచేసిన కరపత్రాలను బ్రోచర్లను ఫ్లెక్సీలను గ్రామాల్లో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతున్నారు. శనివారం బడీడు పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండపాక బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలలో అమలు చేసిన చిత్రాలతో కూడిన పెద్ద ఫ్లెక్సీని ఆవిష్కరించారు.

దుర్గమ్మకు ఊరంతా బోనాలు

మర్కుక్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అమ్మవారికి ఊరంతా బోనాలు సమర్పించారు. ప్రత్యేకంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరంతా మేకల చంద్రకళ కనకయ్య ముదిరాజ్ చినబోయిని సావిత్రి కృష్ణముదిరాజ్‌ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

● వామపక్ష నేతల డిమాండ్



ర్యాలీ చేపట్టిన వామపక్ష పార్టీ నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేర సాగిస్తున్న నరమేధాన్ని వెంటనే నిలుపుదల చేసి కాల్పుల విరమణను ప్రకటించాలని, తక్షణమే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని వామపక్ష పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ లో సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష, ప్రజా ఫ్రంట్, పౌర సంఘాల, దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ప్రజాఫంట్ అధ్యక్షుడు సత్తయ్య, సీఎల్ సి నాయకుడు శ్రీనివాస్, దళిత సంఘాల నాయకుడు భీం సేనలు మాట్లాడుతూ గత 18 నెలలుగా మధ్య భారత అడవుల్లో భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండను కొనసాగిస్తుందని అన్నారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజ్ మడ్‌లో ప్రభుత్వ బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు అలియాస్ బసవరాజుతో పాటు 25కి పైగా మృతి చెంది 15 రోజులు గడవక ముందే సీపీఐ మావోయిస్టు పార్టీ మరో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌ను కేంద్ర మిలట్రీ బలగాలు నిన్న హత్య చేశాయని వారు అన్నారు. శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరిందని, ఆపరేషన్ కగార్ ని ఆపివేయాలనీ, మేధావులు, ప్రజాస్వామిక వాదులు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారని అయినా కూడా నరేంద్రమోడీ, అమిత్ షాల నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.పైగా నరమేధాన్ని తీవ్రతరం చేసిందని, రోజూ ఈ దేశ పౌరులను హత్యలు చేస్తూ పోతుందని,అడవి నుండి ఆదివాసీలను ఖాళీ చేయించి,అడవి సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికే ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిష్టపురం లక్ష్మణ్,కనుకుంట్ల శంకర్,అందే అశోక్, గజాభీమకర్ బన్సీలాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి,జేరిపోతుల జనార్దన్, రంజిత్ రెడ్డి, అభిరాం, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో మద్దూరు క్రీడాకారుల ప్రతిభ

మద్దూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మంగళపల్లిలో నిర్వహిస్తున్న 46వ జూనియర్ బాలుర రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున పాల్గొన్న మద్దూరు క్రీడాకారులు చక్కటి ప్రతిభను ప్రదర్శించి జట్టును నాలుగో స్థానంలో నిలబెట్టారు. ఈ సందర్భంగా జిల్లా హ్యాండ్‌బాల్ అసొసియేషన్ అధ్యక్షుగు కందుకూరి ఉపేందర్ గుప్తా, చైర్మన్ బొడిగం శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం, సభ్యులు మహమ్మద్ ఇంతియాజ్, తుమ్మల కనకయ్య, మద్దూరు మండల అధ్యక్షులు బోయిన మనోహర్, మాజీ ఎంపీటీసీ బూర్గు నర్సింహులు అభినందించారు.

దాతర్‌పల్లిలో సంకల్ప సభ



సంకల్ప సభలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గజ్వేల్ రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మెదక్ ఎంపీ మాదవనేని రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆదేశాల మేరకు గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ ఆధ్యక్షతన బీజేపీ మండల సంకల్ప సభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతితులుగా రాష్ట్ర నాయకులు ఎల్లు రాంరెడ్డి, ఏప్పుల వెంకటరమణ, ఉప్పల మదుసూదన్, మండల అధ్యక్షులు పంజాల అశోక్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం మండల అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో సాకారమైన అనేక లక్ష్యాలను గురించి, ఆయన నాయకత్వంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన అద్భుతమైన పథకాలను ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంటుందని దానికి అనుగుణంగా మండలంలో ప్రతి బూతు స్థాయి వరకు మోదీ కార్యక్రమాలను, పథకాలను తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో అయోమయం

(5వ పేజీ తరువాయి)

తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని కోరుతున్నారు. అలా వీలు కాని పక్షంలో గతంలో ఉన్నట్లు ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో జారీ చేసిన ఉత్తర్వులతో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు.

ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 30 కంటే ఎక్కువగా ఉంటే ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడితో పాటు, ప్రతీ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలి. తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేకపోతే, బహుళ తరగతి బోధన వల్ల ఆయా తరగతులకు సంబంధించిన విద్యా సామర్థ్యాలను సాధించడం సాధ్యం కాదు. దీనివల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

- పురుమాండ్ల రవీందర్‌రెడ్డి, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, అందే

గుణాత్మక విద్యకు ఆటంకం



ప్రతీ తరగతి ఒక గది, అలాంటి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు లేనంత వరకు ఎఫ్ఎల్ఎన్ సాధ్యం కాదు. గుణాత్మక విద్యకు ఆటంకం ఏర్పడుతూనే ఉంటుంది. తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించకుండా ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతో పాఠశాలలను నడిపిస్తూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తున్నారు. 5 తరగతులు 18 సబ్జెక్టులు బోధన కష్టతరంగా ఉంటుంది. ఉపాధ్యాయులకు ఒత్తిడిని తగ్గించేలా, కార్యాచరణ చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఉంది.

-శ్రీరామ్ శ్రీనివాస్, ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు అశాస్త్రీయం



జూన్ 12వ తేదీన ప్రారంభం కానున్న విద్యా సంవత్సరానికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం విద్యాశాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు అశాస్త్రీయంగానూ, లోప భూయిష్టంగానూ ఉన్నాయి. సర్దుబాటు ప్రక్రియకు విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని 15.1 కొనసాగించాలి. లేని పక్షంలో విద్యాశాఖలో కొత్త సంక్షోభాన్ని సృష్టించడం అవుతుంది.

- వైవి.సురేషకుమార్, జిల్లా అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయుల అసోసియేషన్

భక్తులతో కిటకిటలాడిన నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం



సత్యనారయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

వర్గల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యంత ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తులు శనివారం అధికంగా దర్శించుకున్నారు. మొదటి శనివారం వేసవి సెలవులు కావడంతో భక్తులు వారి కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి క్షేత్రానికి తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే క్షేత్రంలో సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం పరిదిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి నిత్యాన్నదాన సత్రం అవరణలోని ఆలయంలో బుధవారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలగే శ్రీ వాసవి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్దులకు వైశ్య సంఘం ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

ములుగు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉప్పరి లక్ష్మి శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి శనావారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వారం రోజులుగా మండల పరిధిలోని ఆర్‌వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో శుక్ర వారం రాత్రి ఆమె మృతి చెందింది. అనంతరం ఆ కుటుంబానికి అంజిరెడ్డి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ దండే కరుణాకర్‌రెడ్డి, శివరాములు, శ్రీనివాస్‌గౌడ్, సురేష్, దశరథతో పాటు తదితరులు ఉన్నారు.

తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా రవీందర్

వర్గల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నల్ల రవీందర్ నియామకమైనారు. బుధవారం మండల పరిధిలోని గౌరారం వద్ద జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో గజ్వేల్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి సబ్బని సత్యం నియామక పత్రాన్ని అందజేశారు. మండల ఉపాధ్యక్షులుగా గొర్రె సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూదరి రాజు, సభ్యులుగా మరాటీ కుమార్, గుర్రాల సురేష్, తాళ్ల నర్సింలు గౌడ్, బోప్పిడి ప్రభాకర్‌రెడ్డి, నీరుడి లింగం, నర్సింలు, నారయణలు నియామకమైనారు.

చిన్న పొరపాటు.. తప్పదు భారీ మూల్యం



ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఐదుగురు



త్రిబుల్ రైడింగ్ చేస్తూ వ్యవసాయ బావుల్లో ఉపయోగించే భారీ వాటర్ పైప్ తీసుకెళ్తున్న దృశ్యం

సిద్దిపేటలో శనివారం ఉదయం పట్టణంలో కొందరు ద్విచక్ర వాహనం పై పిల్లలతో కలిపి ఐదు మంది మరో ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడింగ్ చేస్తూ వ్యవసాయ బావుల్లో ఉపయోగించే భారీ వాటర్ పైప్ తీసుకెళ్తూ ప్రమాదకరంగా ప్రయాణించారు, ఏ కాస్త అజాగ్రత్తగా ఉన్న భారీ ప్రమాదం తప్పదు.

-జిల్లా ఫొటోగ్రాఫర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి)